ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

విజయనగరం

జిల్లా వార్తలు

ఆదివారం 29 జూన్ 2025



అంతా బహిరంగమే..

ఇటీవల బహిరంగ మద్యం తాగుతున్న వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఏకంగా డ్రోన్ కెమెరాలను ప్రయోగించారు. విజయనగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో పదుల సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. అయినా సరే మందుబాబుల తీరులో మార్పు రాలేదు. ఇంకా బహిరంగంగానే మద్యం తాగుతూ కనిపిస్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని పట్టణాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. క్రీడా మైదానాలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఖాళీ స్థలాల్లో మందుబాబుల అడ్డాలుగా మారిపోయాయి. సాయంత్రం 5 గంటలు దాటితే చాలు మద్యం బాబుల సందడి ప్రారంభమవుతుంది. ముఖ్యంగా పట్టణాల్లో ఈ సంస్కృతి అధికంగా ఉంది. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నేరం కానీ జిల్లాలో ఈ నిబంధన అమలు కావడం లేదు.

అనుమతి లేకపోయినా..

- అనధికారికంగా ప్రత్యేక గదుల ఏర్పాటు
- మద్యం షాపుల సమీపంలోనే
- కూర్చొని తాగేందుకూ సౌకర్యాలు
- నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు
- ఆకర్షితులవుతున్న యువత



● విజయనగరంలో ఓ మద్యం దుకాణం చెంతనే ఫాస్టుఫుడ్ సెంటర్ పేరిట షాపును తెరిచారు. అందులో కూర్చొని తినేందుకు వీలుగా కుర్చీలు, డైనింగ్ టేబుల్స్ వేశారు. కర్టెన్స్ వేసి లోపల మరిన్ని టేబుల్స్ కుర్చీలు వేశారు. అందులోనే మందుబాబులు మద్యం సేవిస్తున్నారు. రోజుకు అక్కడ జరిగే వ్యాపారం రూ.40 వేల పైమాటేనని తెలుస్తోంది.

● డెంకాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉన్న ఓ దాబాలో అనధికారికంగా మద్యం సేవిస్తున్నారు. లోపల మందుబాబులు మద్యం తాగేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. బయట నుంచి మద్యం తెచ్చుకుని ఫుడ్ ఆర్డర్ ఇస్తున్నారు. వయసుతో పనిలేదు. అక్కడ రోజుకు రూ.80 వేలకుపైగా వ్యాపారం జరుగుతోంది.

విజయనగరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి)

విజయనగరం, డెంకాడలోనే కాదు జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. అనుమతి తీసుకోకుండా దాబాలను పోలినట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడ మద్యం వినియోగం విచ్చలవిడిగా సాగుతోంది. వారే స్వయంగా కూడా మద్యం విక్రయిస్తున్నారు. ఇదంతా అనధికారికం. ఇలాంటివి జిల్లాలో 500 వరకూ వెలిసినట్టు సమాచారం. గత ఏడాది అక్టోబరులో కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీని తీసుకొచ్చింది. జిల్లా వ్యాప్తంగా 153 మద్యం దుకాణాలను టెండర్ల రూపంలో ప్రైవేటు వ్యక్తులకు ఖరారు చేసింది. అయితే ఒక్క మద్యం అమ్మకాల ద్వారా అయితే లాభాలు చాలవని భావించిన మద్యం దుకాణదారులు అనధికారికంగా పర్మిట్ రూమ్‌ల మాదిరి ఎక్కడికక్కడ తెరిచేశారు.

వాస్తవానికి మద్యం దుకాణాల వద్ద ప్రభుత్వం ఎటువంటి పర్మిట్ రూమ్‌లకు అనుమతివ్వలేదు. ఒకవేళ అక్కడే తాగేందుకు అవకాశమిస్తే ప్రభుత్వానికి అదనంగా రూ.5 లక్షలు కట్టాలి. ఈ విషయాన్ని నోటిఫికేషన్‌లోనే స్పష్టంగా పేర్కొంది. షాపులో మద్యం నిల్వలు చాలకుంటే అదనంగా గోదాములు అద్దెకు తీసుకున్నవారు ఏడాదికి ప్రభుత్వానికి రూ.లక్ష వరకూ చెల్లించాలి. కానీ జిల్లాలో చాలావరకూ మద్యం షాపులు పర్మిట్ రూమ్‌లకు అనుమతి తీసుకోలేదు. అదనంగా ప్రభుత్వానికి రూపాయి చెల్లించలేదు. కానీ ఎక్కడికక్కడే మద్యం దుకాణాల సమీపంలో ఈ తరహా షాపులు వెలిశాయి. వాటిని మద్యం దుకాణదారులే (మిగతా 8వ పేజీలో..)

సెర్ప్‌లో సెపరేట్ బదిలీలు

- మిగులు పోస్టుల పేరుతో దూర ప్రాంతాలకు పంపిన వైనం
- నిబంధనలకు నీళ్లు
- మహిళా ఉద్యోగులకు అన్యాయం


డీఆర్‌డీఏ కార్యాలయం

● డీఆర్‌డీఏలో డీపీఎంగా పనిచేస్తున్న ఓ మహిళా బదిలీ కోసం ఎటువంటి దరఖాస్తు చేసుకోలేదు. అయినా వెయ్యి కిలోమీటర్ల దూరంలో ఉన్న నంద్యాల జిల్లాకు బదిలీ చేశారు. తనకు బదిలీల్లో అన్యాయం జరిగిందంటూ ఆమె కోర్టును ఆశ్రయించారు.

● డీఆర్‌డీఏలో పనిచేసిన ఏపీఎంలను సాధారణంగా జోన్ పరిధిలోనే బదిలీ చేయాల్సి ఉంది. కానీ 8 మందిని జోన్ పరిధి దాటించారు. వీరిలో మహిళా ఉద్యోగులతో పాటు 50 సంవత్సరాలు పైడిన వారూ ఉన్నారు. అంత దూరం వెళ్లాలా? వద్దా ? అని తర్జనభర్జన పడుతున్నారు.

విజయనగరం కలెక్టరేట్, జూన్ 28(ఆంధ్రజ్యోతి):

సెర్ప్‌లో (వెలుగు)ఉద్యోగుల బదిలీలు భిన్నంగా జరిగాయి. ఊహించని ప్రాంతాలకు బదిలీ కావడంతో వారంతా అయోమయంలో పడ్డారు. మిగులు పోస్టులకు సర్దుబాటు పేరుతో దూర ప్రాంతాలకు స్థాన చలనం చేశారు. పొరుగు, పక్క జిల్లాలు అయితే పర్వాలేదు. మూడు, నాలుగు జిల్లాలు దాటించడంతో గగ్గోలు పెడుతున్నారు. ప్రధానంగా మహిళా ఉద్యోగులను దూర ప్రాంతాలకు పంపడంతో ఆందోళన చెందుతున్నారు. ఎక్కువ కాలం పనిచేసిన వారిని జిల్లాలో ఉంచి, బదిలీ కోసం కనీసం దరఖాస్తు చేసుకోలేని వారిని దూరం ప్రాంతాలకు పంపినట్లు ఉద్యోగ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

జిల్లాలోని వెలుగులో 11 మంది డీపీఎంలు, 53 మంది ఏపీఎంలు పనిచేస్తున్నారు. ఉండాల్సిన సిబ్బంది కంటే అధికంగా ఉన్నారని కొందరిని ఇతర జిల్లాలకు సర్దుబాటు చేశారు. అయితే ఈ ప్రక్రియ (మిగతా 8వ పేజీలో..)



నియామక తేదీయే కీలకమట

- ఆ ఒక్క రోజు ఆధారంగా బదిలీ స్థానం నిర్ణయం
- ఏఎన్‌ఎంలను వెనక్కు నెట్టిన స్వల్ప సమయం తేడా
- మెరుగైన ర్యాంకర్లు డీఎంహెచ్‌వో కార్యాలయానికి పరుగులు


జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ గ్రీవెన్స్‌కు వచ్చిన గ్రామ వార్డు సచివాలయ గ్రేడ్-3 ఏఎన్‌ఎంలు

శృంగవరపుకోట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి):

రెండు రోజుల్లో జరగనున్న గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీ (ఎఎన్‌ఎం గ్రేడ్-3) బదిలీలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ శుక్రవారం సాయంత్రం విడుదల చేసిన ప్రాథమిక జాబితాలో చోటు చేసుకున్న ప్రాధాన్యతలను చూసి అందరూ విస్తుపోయారు. డేట్ ఆఫ్ అపాయింట్ మెంట్‌ను అనుసరించి బదిలీ స్థానాలను నిర్ణయించడంతో నియామక పరీక్షలో మెరుగైన ర్యాంకులను సాధించిన వారంతా వెనక్కి వెళ్లిపోయారు. పరీక్షలో తక్కువ ర్యాంకులు పొందిన ఏఎన్‌ఎంలంతా బదిలీల్లో ముందువరసకు వచ్చారు. ఈ నేపథ్యంలో తమకు జరిగిన అన్యాయాన్ని వివరించేందుకు పరీక్షలో మంచి ర్యాంకులు పొందిన వారంతా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి పరుగులు తీశారు. గోడు వినిపించినా ప్రయోజనం లేకపోయింది. శనివారం రాత్రి డీఎంహెచ్‌వో విడుదల చేసిన జాబితాలో కూడా న్యాయం జరగలేదు.

వైసీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా గ్రామ వార్డుల్లో ప్రజా ఆరోగ్య పరిరక్షణకు గ్రామాల్లో గ్రేడ్-3 ఏఎన్‌ఎంలు, వార్డుల్లో హెల్త్ సెక్రటరీలను నియమించారు. నియామక పరీక్షలో ర్యాంకులు సాధించిన వారందరినీ గ్రామ, వార్డు సచివాలయాల్లో నియమించేందుకు 2019 నవంబర్ 5న జిల్లా పరిషత్ కార్యాల యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. మొదటి ర్యాంకుతో మొదలెట్టి ఆఖరు ర్యాంకు వరకు కౌన్సెలింగ్ అయ్యేసరికి అర్ధరాత్రి సమయం పట్టింది. దాదాపుగా రెండు వందలలోపు ర్యాంకులు వచ్చిన వారందరికీ మధ్యాహ్న సమయానికి కౌన్సెలింగ్ పూర్తికావడంతో అదేరోజు గ్రామ, వార్డు సచివాలయాల్లో చేరేందుకు వెళ్లారు. వారిలో కొంతమందిని కౌన్సెలింగ్ రోజునే చేర్చేసుకున్నారు. మిగతా వారు (మిగతా 8వ పేజీలో..)

మత్స్య అవతారంలో జగన్నాథ స్వామి 6లో



చేతులు జోడించి కోరుతున్నా.. 6లో

- నిర్వాసితుల సమస్యలను ముందు పరిష్కరించండి
- తాటిపూడి నీటిపై స్పష్టత ఇవ్వండి
- కొత్త పరిశ్రమలపై ప్రజాభిప్రాయసేకరణ చేపట్టండి
- పరిశ్రమలను వ్యతిరేకించడం లేదు ● ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు



అర్ధరాత్రి గ్రామాల్లోకి గజరాజులు 6లో

- ధాన్యం నిల్వలు, షట్టర్లు ధ్వంసం
- వరి, ఆకుమడులు, జొన్నచేన్లకు నష్టం
- రెవెన్యూ, అటవీ సిబ్బంది హెచ్చరికలు


మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

బాలలందరినీ బడిలో చేర్చాలి

- సర్వే ద్వారా బయట ఉన్న వారిని గుర్తించండి
- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలి
- కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లు నిండిన బాలబాలికలందరినీ బడిలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. సోమవారం నుంచి ఇంటింటా సర్వే నిర్వహించి బడిలో చేరని పిల్లలను గుర్తించాలన్నారు. సార్వత్రిక విద్యపై వివిధ శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమావేశం శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్రోల్‌మెంట్ స్పెషల్ డ్రైవ్ సర్వే చేపట్టాలని ఆదేశించారు. ఆగస్టు 31 నాటికి ఐదేళ్లు పూర్తి అవుతున్న పిల్లలందరినీ విధిగా మొదటి తరగతిలో చేర్పించాలన్నారు. 6 నుంచి 15 సంవత్సరాల లోపు బాలబాలిలందరూ పాఠశాలలోనే ఉండాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదు సంవత్సరాలు పూర్తిచేసుకున్న పిల్లల వివరాలు విద్యాశాఖకు అందజేయాలని, ఐదు సంవత్సరాలు దాటిన పిల్లలందరూ ఏ పాఠశాలలో చేరనదీ ఇంటింటా సర్వే నిర్వహించి తెలుసుకోవాలన్నారు. సర్వే జాబితాను, శిశు సంక్షేమ శాఖ అందజేసిన జాబితాతో పోల్చి నిర్ధారణకు రావాలని సూచించారు. అనంతరం సార్వత్రిక విద్యా పీఠం ప్రచార పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈవో మాణిక్యం నాయుడు, జడ్పీ సీఈవో సత్యనారాయణ, గిరిజన సంక్షేమాధికారి శ్రీనివాసరావు, జిల్లా సాంఘిక సంక్షేమాధికారి అన్నపూర్ణ, డ్వామా పీడీ శారదదేవి సమగ్ర శిక్ష ఏపీసీ రామారావులు పాల్గొన్నారు.

కొత్త మార్పులు


గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం ఏర్పాటయ్యేదిక్కడే..

- కూటమి ప్రభుత్వం వచ్చాక దశ మారుతున్న కొత్తవలస
- పతంజలి ప్రాజెక్టుకు కదలిక
- గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం ఏర్పాటు
- జోరుగా సిమెంట్ ఫ్యాక్టరీ పనులు

కొత్తవలస, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత శృంగవరపుకోట నియోజకవర్గంలోని కొత్తవలసలో అనేక మార్పులు వస్తున్నాయి. అభివృద్ధి దిశగా ఒక్కో అడుగు పడుతోంది. 2015వ సంవత్సరంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పతంజలి సంస్థ ఉత్పత్తుల తయారీ కంపెనీల ఏర్పాటుకు ఇక్కడ భూములు సేకరించారు. భవన నిర్మాణం ప్రారంభమవుతుందని అనుకుంటున్న సమయంలో ఎన్నికలు రావడం.. ప్రభుత్వం మారిపోవడం జరిగింది. వైసీపీ హయాంలో ఎలాంటి కదలిక లేకపోయింది. కూటమి వచ్చాక ఆ భూముల వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. గతంలో సేకరించిన 174 ఎకరాల్లో ప్రాజెక్టు ఏర్పాటు చేస్తామని పతంజలి సంస్థల వ్యవస్థాపకుడు రామ్‌దేవ్‌బాబా స్వయంగా ప్రకటించడమే కాకుండా భూములను ఆయనే ఇటీవల పరిశీలించారు.

● గిరిజన యూనివర్సిటీ కోసం రెల్లి రెవెన్యూ పరిధిలోని అప్పన్నదొరపాలెం గ్రామంలో సేకరించిన 526 ఎకరాల్లో రాష్ట్రానికే తలమానికమైన పోలీసు గ్రేహౌండ్స్ శిక్షణ (మిగతా 8వ పేజీలో..)


తమ సంస్థకు కేటాయించిన భూములను స్వయంగా పరిశీలిస్తున్న రామ్‌దేవ్ బాబా(ఫైల్)

పనిభారం తగ్గించాలి

- పంచాయతీ కార్యదర్శుల నిరసన

విజయనగరం కలెక్టరేట్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పనిభారం తగ్గించాలంటూ పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద శనివారం నిరసన తెలిపారు. పంచాయతీరాజ్ కమిషనర్ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు కార్యదర్శులు మాట్లాడుతూ గ్రామాల్లోకి ఉదయం 6 గంటలకే వెళ్లి పారిశుధ్యం పనులు పర్యవేక్షించి ఫొటో అప్‌లోడ్ చేయాలని కమిషనర్ చెప్పడం దారుణమన్నారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ నుంచి పంచాయతీ వ్యవస్థను వేరు చేసి జీఎస్‌డబ్ల్యూ విధుల నుంచి విముక్తి చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం, నీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు.


నిరసన తెలియజేస్తున్న కార్యదర్శులు

ఎన్టీఆర్‌తో తెలుగువారికి గౌరవం 7లో
● ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి కృషి 7లో
● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

మెరుగైన సేవలు అందించండి
● అడిషనల్ డైరెక్టర్ జనరల్ నాసిన్

గంజాయితో ఐదుగురి అరెస్టు 7లో
కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ పూర్తి

ఆషాఢ మాసాన..



- కొత్త దంపతులకు తప్పని ఎడబాటు
- కన్నవారి ఇళ్లకు చేరిన కొత్తకోడళ్లు
- ఈ నెలలో పుణ్యతిథులు ఎన్నో

విజయనగరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి)

ఆషాఢ మాసం వచ్చేసింది. ఈ మాసాన్ని శూన్య మాసమని కూడా అంటారు. ఇది శభకార్యాలకు మంచిది కాదనే భావన చాలామందిలో ఉంది. ఈ నెలలో వివాహాలు, ఇతర శుభకార్యాలు చేయడానికి ఇష్టపడరు. కానీ వ్రతాలు, పూజలకు ఎంతో విశిష్టమైనది. సూర్యుడు మిథునరాశి నుంచి కర్కాటక రాశిలో ప్రవేశిస్తాడు. దీంతో ఉత్తరాయణ పుణ్యకాలం పూర్తయి దక్షిణాయణం మొదలవుతుంది. తొలి ఏకాదశి, గురుపౌర్ణమి, పూరీ జగన్నాథుడి ఉత్సవాలు... ఇవన్నీ వచ్చేది ఈ నెలలోనే. వర్షాల ప్రారంభానికి సంకేతం ఈ మాసం. ఈ నెలలో శ్రీమహావిష్ణువుకు ఎంతో ఇష్టమైన తొలి ఏకాదశి పర్వదినం మొదలవుతుంది. ఆషాఢం నుంచి శ్రీమహావిష్ణువు యోగ నిద్రలో ఉంటారని.. ఈ నెలలో వచ్చే తొలి ఏకాదశిని శయన ఏకాదశి లేదా తొలి ఏకాదశి అంటారు. ఈ నెలలో గురుపౌర్ణమి, జగన్నాథ స్వామి రథయాత్రలు నిర్వహిస్తారు. ఈ నెలలో వర్షాలు అధికంగా పడుతుంటాయి. అందుకే పూర్వం ఆషాఢ మాసంలో పెళ్లిళ్లు చేస్తే.. వర్షాలతో ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుందని వివాహాలు చేసేవారు కాదు. కాలక్రమంలో ఆషాఢ మాసం శుభకార్యక్రమాలకు మంచిది కాదనే భావన ఏర్పడింది.

పుట్టింటికి ఆడపిల్లలు..



ఆషాఢ మాసంలో కొత్త కోడళ్లు అత్తవారి ఇళ్ల నుంచి కన్నవారి ఇళ్లకు చేరుకున్నారు. ఈ నెలలో కొత్త అల్లుడు.. అత్త ముఖం చూడరాదని కొందరు.. అత్త కొత్త కోడలు ఒకే ఇంట్లో ఉండరాదని కొందరు.. ఎలా చూసినా కొత్త దంపతుల మధ్య ఎడబాటు మాత్రం తప్పదు.

వ్యవసాయ పనుల కోసమే..

మునుపటి కాలంలో గ్రామాల్లో పండుగలు, వేడుకలు, విశేషాలు, జాతరలు, వ్యవసాయ పనుల్లో వెసులుబాట్ల ఆధారంగానే జరిగేవి. ఆషాఢ మాసమంటే వర్షాలు మొదలై... వ్యవసాయ పనులు పుంజుకునే సమయం. పొలం పనులతో అందరూ హడావుడిగా ఉంటారు. ఇరు కుటుంబాల్లో వ్యవసాయ పనుల వెసులుబాటు కోసం కొత్త దంపతులను వేర్వేరుగా ఉంచే ఆనవాయితీని పెట్టుకున్నారని చెబు తారు. దీన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు ఆషాఢ మాసంలో అత్త ముఖం అల్లుడు చూడటం అరిష్టమనే కఠిన నియమాన్ని విధించారని కూడా పెద్దలు చెబుతారు.



పుట్టే బిడ్డ ఆరోగ్యం కోసమే..

ఇదే కాకుండా మరో కోణంలో కూడా ఆషాఢ మాసంలో కొత్త జంటలు వేర్వేరుగా ఉండాలనే నియమాన్ని పెట్టినట్టు చెబుతారు. ఆషాఢ మాసంలో అమ్మాయి గర్భం దాలిస్తే ఏప్రిల్ నెలలో ప్రసవించాల్సి ఉంటుందని... వేసవి కాలంలో ప్రసవిస్తే బిడ్డకు మంచిది కాదనే ఉద్దేశంతోనూ ఈ ఎడబాటు కల్పించారని చెబుతారు. శాస్త్రాలు, విశ్వాసాలు, సంప్రదాయాలు, కట్టుబాట్లు... వీటి వెనుక విజ్ఞానంతో పాటు శాస్త్రీయత కూడా ఉందంటున్నారు. నేటి తరం భార్యాభర్తలు ఉద్యోగాలు చేస్తున్నందున కొత్తజంటలకూ కలసి ఉండక తప్పడం లేదు. ఒకేచోట ఉద్యోగాలు చేసేవారికైతే కలసి ఉండడం తప్పనిసరి.



గోరింట పూయాలని...



ఆషాఢంలో మహిళలు తప్పనిసరిగా గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీ. పిల్లల నుంచి పెద్దల వరకు గోరింటాకు చేతులకు పూసుకుంటారు. మహిళలు గోరింటాకు పెట్టుకోవడాన్ని శుభప్రదంగా భావిస్తారు. దీనివల్ల అందంతో పాటు ఆరోగ్యం కూడా బాగుంటుందని ఆయుర్వేదం చెబుతోంది. వర్షాకాలంలో చర్మవ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు గోరింటాకు దోహదపడుతుంది. అంతే కాకుండా గోరింటాకు ఎర్రగా పండడాన్ని శుభప్రదంగా మహిళలు భావించేవారు. నేటి తరం మహిళలు మోహిందీ సంస్కృతితో గోరింటాకుకు దూరంగా ఉంటున్నారు.

కొత్త అనుబంధానికి అటంకం..

నాకు పెళ్లయి సుమారు 50 ఏళ్లు అవుతుంది. అప్పట్లో ఆషాఢ మాసం వర్షాకాలం ప్రారంభమైన సమయంలో కొత్తయిన పెళ్లి జంట వ్యవసాయ పనులకు వెళ్తే, పెళ్లి కూతుళ్లకి ఇబ్బందులు ఎదురౌతుందని చెప్పేవారు. వేరే ప్రాంతం నుంచి వచ్చిన వారు ఇమడలేరని, వర్షాలు వల్ల అంటువ్యాధులు వ్యాపిస్తాయని దూరంగా ఉంచేవారు. నా కుమారులకు అదేవిధంగా కొనసాగి స్తూ వచ్చాను.

-సిరిపురం వెంకటమ్మ, గృహిణి, పిట్టాడ

శుభకార్యాలకు తప్ప.. ఎంతో మంచిది

శుభకార్యాలకు తప్ప ఆషాఢమాసం ఎంతో మంచిది. తొలి ఏకాదశి (శయన ఏకాదశి), గురుపౌర్ణిమ వంటివి ఈ నెలలోనే వస్తాయి. దేవతలకు పసుపు, కుంకుమ సమర్పించేందుకు అనువైన కాలం. ఆషాఢ మాసంలో వర్షాలు ఎక్కువగా పడతాయి. దీంతో వాతావరణం చల్లగా ఉంటుంది. ఏకాదశి వంటి పర్వదినాల్లో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఉంటాయి. ఆషాఢమాసంలో వివాహాది శుభకార్యాలు ఉండవు. దీంతో పురోహితులు కుటుంబాలతో కలిసి తీర్థయాత్రలకు, ఇతర పనుల పైన వెళ్తుంటారు.

-కె శ్రీనివాసరావు, పురోహితుడు



పాఠశాల భవనం ఇలా..

15 ఏళ్లుగా అసంపూర్తిగానే..

- అర్ధాంతరంగా నిలిచిన లుంబేష్ పాఠశాల భవన నిర్మాణం
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

గుమ్మలక్ష్మీపురం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లుంబేష్ గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం 15 ఏళ్లు అయినా నేటికీ పూర్తికాలేదు. సగం నిర్మించిన భవనంలోనే ఆ పాఠశాల విద్యార్థులు చదువు సాగిస్తున్నారు. ఈ పాఠశాల గతంలో ద్రవ్య సహాయక పాఠశాలగా ఉండేది. 15 ఏళ్ల కిందట అప్పటి పార్వతీపురం ఎంపీ వైరిచర్ల కిషోర్‌చంద్ర సూర్యనారాయణదేవ్ ఈ పాఠశాలకు పక్కా భవన నిర్మాణానికి రూ.3లక్షలు తన పార్లమెంట్ నిధుల నుంచి మంజూరు చేశారు. అప్పటి లుంబేష్ సర్పంచ్ జయమ్మ చొరవ తీసుకుని ఈ పాఠశాల భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. శ్లాబు వేయడం పూర్తి చేసి, సగం వరకు గోడలు నిర్మించారు. ఈ నిర్మాణానికి నిధులు ఖర్చు అయిపోయాయి. మిగిలిన పనులు పూర్తి చేయడానికి నిధుల కొరత ఏర్పడింది. దీంతో ఈ పాఠశాల భవన నిర్మాణం గత 15 ఏళ్లుగా అర్ధాంతరంగా నిలిచిపోయింది. గత వైసీపీ ప్రభుత్వంలో నాడు-నేడు పథకం కింద ఈ పాఠశాల భవనం పక్కనే మరో భవనాన్ని నిర్మించారు. ఈ భవన నిర్మాణం శ్లాబు వరకు వచ్చింది. ఆ తర్వాత ప్రభుత్వం మారిపోవడం, నిధుల కొరత కారణంగా ఈ భవన నిర్మాణం కూడా మధ్యలో ఆగిపోయింది. నాడు-నేడు పాఠశాల భవన నిర్మాణానికి ఫ్లోరింగ్ టైల్స్ తలుపులు, కిటికీలు, శానిటరీ సామాన్లు, ప్లంబింగ్ సామాన్లు ఈ పాఠశాలకు చేర్చారు. నిధుల కొరత వల్ల ఈ భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో ఈ విలువైన సామగ్రి అంతా మూలన పడింది. సంబంధిత అధికారులు స్పందించి ఈ పాఠశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి..

నిధుల కొరత కారణంగా పాఠశాల భవన నిర్మాణాలు సగంలోనే నిలిచిపోయాయి. నిధులు మంజూరు చేయాలని విద్యాశాఖ అధికారులను కోరాం.

-మోహన్‌రావు, హెచ్ఎం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, లుంబేష్

నిర్మాణ పనులు ప్రారంభిస్తాం..

నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

-అప్పారావు, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఏఈ



విజయనగరం రూరల్: మత్స్య అవతారంలో జగన్నాథుడు



పాలకొండ: గుడించా మందిరంలో జగన్నాథస్వామి



పార్వతీపురం టౌన్‌లో



సాలూరు పట్టణంలో..

మత్స్య అవతారంలో జగన్నాథుడు

- ఘనంగా రథోత్సవం

జగన్నాథ స్వామి రథోత్సవాన్ని ఉమ్మడి జిల్లాలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా బలభద్ర, సుభద్ర సహిత జగన్నాథస్వామిని గుండిచా మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం జగన్నాథస్వామి మత్స్య అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. **(ఆంధ్రజ్యోతి బృందం)**



జిల్లా కలెక్టర్‌కు తమ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలనీ నినాదాలు చేస్తున్న నిర్వాసితులు

ఆ మాటలను కలెక్టర్ వెనక్కి తీసుకోవాలి

- ఎవరో ప్రలోభపెడితే పోరాటం చేయడం లేదు
- నిర్వాసితుల డిమాండ్

శృంగవరపుకోట రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ అంబేడ్కర్ తమ పోరాటంపై చేసిన వ్యాఖ్యలు తమ మనోభావాలను దెబ్బతీశాయని, వాటిని వెనక్కు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. బొడ్డవర గ్రామం వద్దకు శనివారం చేరుకుని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పోరాటంలో పాల్గొంటున్న యువత చదువుకున్న వారని, ఎవరో ప్రలోభపెడితే లొంగిపోయే స్థితిలో లేరని చెప్పారు. బంగారు భవిష్యత్ ఉంటుందని అప్పటి జడ్పీటీసీ, ఇప్పటి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చెబితే సాగులో వున్న భూములను తక్కువ ధరకు వచ్చామని, న్యాయం కోసం 18ఏళ్లుగా ఎదురుచూశామన్నారు. పరిశ్రమలు పెడతామని ప్రభుత్వం చెప్పడంపై తాము కూడా సంతోషంగా ఉన్నామని, అయితే జిందాల్ యాజమాన్యం ఇచ్చిన హామీలు అమలుచేయాలని కోరుతున్నామన్నారు. పరిశ్రమల స్థాపనకు తాము వ్యతిరేకంగా కాదని పేర్కొన్నారు. జిందాల్ నిర్వాసితులు రోడ్డుమీదకు వచ్చారన్న విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు పదుల సంఖ్యలో చేరుకోవడంతో టెన్షన్ వాతావరణం కనిపించింది.

చేతులు జోడించి కోరుతున్నా



- నిర్వాసితుల సమస్యలను ముందు పరిష్కరించండి
- తాటిపూడి నీటిపై స్పష్టత ఇవ్వండి
- కొత్త పరిశ్రమలపై ప్రజాభిప్రాయసేకరణ చేపట్టండి
- గత హామీలను అమలు చేయాలని రైతులు కోరుతున్నారు
- పరిశ్రమలను వ్యతిరేకించడం లేదు
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

శృంగవరపుకోట రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అందరికీ చేతులు జోడించి కోరుతున్నానని, జిందాల్ నిర్వాసితుల సమస్యలను ముందు పరిష్కరించాలని, తాటిపూడి నీటిపై స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. జిందాల్ భూముల్లో ఏర్పాటుచేయబోయే కొత్త పరిశ్రమలకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని, అందరి అభిప్రాయాలు తెలుసుకుని అడుగులు వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బొడ్డవర గ్రామంలోని తన నివాసంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. 2008లో నాలుగు పంచాయతీల ప్రజలు తన మాట నమ్మి జిందాల్ పరిశ్రమకు భూములు ఇచ్చారని, పరిశ్రమ ఏర్పాటు చేయకపోగా ఒక్క హామీ అమలుచేయలేదన్నారు. గత హామీలు అమలుచేయాలని ఇప్పుడు కోరుతున్నారని తప్ప పరిశ్రమలను వ్యతిరేకిస్తూ కాదన్న విషయం కలెక్టర్‌తో సహా అందరు గమనించాలన్నారు. ఎవరెవరో వచ్చి ఏదేదో మట్లాడుతున్నారని, వారు ఎవరైనా ఇక్కడి రైతులతో మాట్లాడారా అని ప్రశ్నించారు. నిర్వాసితులతో 'మీకు నచ్చిన చోట సమావేశం పెట్టి' వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇక్కడి పోలీస్ యంత్రాంగం పూర్తిగా జిందాల్ పరిశ్రమ చేతుల్లోకి వెళ్లిందని, రైతులపై బైండోవర్ కేసులు పెట్టడం ఇందుకు నిదర్శనమని, రైతులు బయటకు వస్తే అరెస్టులు చేస్తామని బెదిరించడం సరికాదన్నారు. ఇక్కడ పరిశ్రమలకు తాటిపూడి నీరు ఇస్తామని జీవోలో పేర్కొన్నారని, ఈనీరు ఇస్తే దీనిని నమ్ముకొని పంటలు పండిస్తున్న రైతులు, దాహం తీర్చుకుంటున్న విశాఖ, విజయనగరం ప్రజల పరిస్థితిపై ఆలోచన చేయాలని కోరారు.



ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట చంటి బిడ్డలతో పడిగాపులు కాస్తున్న తల్లులు

చిన్నారులతో పడిగాపులు

- ఎఫ్ఆర్ఎస్ కోసం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద తల్లుల అవస్థలు

సీతంపేట రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో మారుమూల గిరిజన గ్రామాలకు పూర్తిస్థాయిలో సెల్‌సిగ్నల్స్ లేకపోవడంతో గిరిజనులకు ఇక్కట్లు తప్పడం లేదు. పోషన్ అభియాన్‌లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న ఏడు నెలల నుంచి మూడేళ్ల చిన్నారులకు ముఖ ఆధారిత నమోదు (ఎఫ్ఆర్ఎస్)తప్పనిసరి చేశారు. దీంతో గర్భిణులు, చిన్నారులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం ఎఫ్ఆర్ఎస్ కోసం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయానికి చంటి బిడ్డలతో వచ్చిన తల్లులు నానా పాట్లు పడ్డారు. ఈనెల 30వ తేదీ ఆఖరు రోజు కావడంతో ఎఫ్ఆర్ఎస్ చేసుకునేందుకు పెద్ద సంఖ్యలో గిరిజన గర్భిణులు, బాలింతలు కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయం బయట పడిగాపులు కాశారు.

గిరిశిఖర గ్రామాల్లో సిగ్నల్ లేకపోవడంతో..

గిరిశిఖర గ్రామాల్లో సిగ్నల్ లేని కారణంగా ముఖ ఆధారిత నమోదు కాకపోవడంతో వీరంతా సీతంపేట ఐసీడీఎస్ కార్యాలయానికి వచ్చారని, ఇక్కడ వీరితో ఎఫ్ఆర్ఎస్ వేయిస్తున్నట్టు సీడీపీవో సిమ్మాలమ్మ చెప్పారు. ముఖ ఆధారిత నమోదు కాకుంటే వీరికి పౌష్టికాహారం అందదన్నారు. సమయం తక్కువగా ఉన్నందున ఈ ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేస్తున్నామని తెలిపారు.



సరసనాపల్లిలో గజరాజుల గుంపు

అర్ధరాత్రి గ్రామాల్లోకి గజరాజులు

- ధాన్యం నిల్వలు, షాను షట్టర్లు ధ్వంసం
- వరి, ఆకుమడులు, జొన్నచేన్లకు నష్టం
- రెవెన్యూ, అటవీ సిబ్బంది హెచ్చరికలు

రేగిడి/వంగర, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల క్రితం వంగర మండలంలోకి ప్రవేశించిన గజరాజుల గుంపు శుక్రవారం అర్ధరాత్రి వంగర-రేగిడి మండలాల సరిహద్దులకు చేరింది. తెల్లవారుజామున మడ్డువలస ప్రాజెక్టు కాల్వగుండా రేగిడి మండలం సరసనాపల్లి గ్రామాంలో ప్రవేశించింది. ఈగుంపులో ఐదు పెద్ద ఏనుగులు, నాలుగు చిన్నఏనుగులు ఉన్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. సరిగ్గా రెండేళ్ల క్రితం ఇదేరీతిన రేగిడి మండలం సరసనాపల్లి గ్రామంలో ఏనుగులు హల్‌చల్ చేయగా.. తాజాగా గ్రామసమీపంలో ఉన్న అంగన్వాడీ కేంద్రం వద్దకు వచ్చి కాసేపు సేద తీరాయి. రాత్రి అయినా వీటిని చూసేందుకు గ్రామస్థులు ఎగబడ్డారు. అటవీ, రెవెన్యూ సిబ్బంది వచ్చి ప్రజలకు అప్రమత్తం చేశారు. అయితే ఇవి సంచరిస్తున్న ప్రాంతంలో వరి, ఆకుమడులు, జొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉదయం పూట సమీపం తోటల్లోకి వెళ్లి ఏనుగులు తిష్ట వేస్తున్నాయి. పొద్దుపోయేవరకు అక్కడే ఉంటున్నాయి. వీటిపై ఎవరూ కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని తహసీల్దార్ కృష్ణలత ప్రజలకు విజ్ఞప్తి చేసారు.

వంగరలో..

మరువాడలో ఈ నెల 25న ప్రవేశించిన గజరాజులు జగన్నాథ వలసలో తిష్ట వేశాయి. శుక్రవారం రాత్రి మడ్డువలసలో చొరబడి బూరాడ వెంకటరావు కల్లంలో నిల్వ చేసిన ధాన్యం, షాపు షట్టర్లు ధ్వంసం చేశాయి. శనివారం ఉదయం మడ్డువలస, జగన్నాథ వలసతో పాటు రేగిడి మండలం సరసనాపల్లి ప్రాంతాల్లో పంటలు నాశనం చేశాయి, రాజాం-వంగర ప్రధాన రహదారిలో ప్రయాణించే వారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.



మడ్డువలసలో ధ్వంసం అయిన పంటలు, షాపు షట్టర్

రోడ్డును తవ్వి.. నామమాత్రంగా పూడ్చి

●తాగునీటి పైప్‌లైన్ మరమ్మతుల పేరిట ఎక్కడకక్కడ గోతులు

●ఇబ్బంది పడుతున్న వాహనదారులు, స్థానికులు



బంక్ సమీపంలో రోడ్డును తవ్వుతున్న దృశ్యం

రాజాం రూరల్, జూన్28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో తాగునీటి పైప్‌లైన్ మరమ్మతుల పేరిట ప్రధాన రోడ్డును ఎక్కడికక్కడే తవ్వేస్తున్నారు. ఆ తర్వాత నామమాత్రంగా గోతులను పూడ్చి వదిలేస్తున్నారు. దాంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్థానికులూ అవస్థలకు గురవుతున్నాయి. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల శ్రీకాకుళం రోడ్డులో పెట్రోల్ బంక్ వద్ద పైప్‌లైన్ మరమ్మతుల పేరిట రెండు చోట్ల పెద్దపెద్ద గోతులు తవ్వి ఆపై మట్టిపోసి వదిలేశారు. దాంతో ఆ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుం టున్నాయి. మున్సిపల్ అధికారులు ప్రణాళికా బద్ధంగా వ్యవహరించని తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



పనులు పూర్తయిన తర్వాత పూడ్చిన తీరు

లోకేశ్‌ను కలిసిన కోండ్రు



లోకేశ్‌తో ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, జూన్28 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో విద్య, ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌ను శనివారం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు. రాజాంలో పీజీ స్టడీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే నియోజకవర్గం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని లోకేశ్‌ను కోరారు.

పదోన్నతి పొందిన ఎస్‌ఐలకు అభినందనలు



సర్దార్ ఖాన్‌ను అభినందిస్తున్న డీఐజీ

విజయనగరం క్రైం, జూన్28 (ఆంధ్రజ్యోతి): విశాఖ రేంజ్ పరిధిలో నలుగురు ఏఎస్‌ఐలకు ఎస్‌ఐలుగా పదోన్నతి కల్పిస్తూ విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన వారిలో డి.సురేష్‌ను పార్వతీపురం-మన్యం జిల్లా, డి.సత్యారావును శ్రీకాకుళం జిల్లా,కె.శ్రీనివాసరావు, సర్దార్ ఖాన్‌లను విజయనగరం జిల్లాలకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన ఏఎస్‌ఐలను డీఐజీ అభినందించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 67 మందికి జరిమానా

విజయనగరం క్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో 67 మందికి శనివారం రూ.6.70 లక్షల జరిమానాను న్యాయాధికారి విధించారని ఎస్పీ వకుల్ జిందాల్ ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని ట్రాఫిక్ సీఐ సూరినాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు మద్యం సేవించి వాహనం నడిపేవారిపై ప్రత్యేక తనిఖీలు చేపట్టి, 67 మందిపై కేసులు నమోదు చేశారన్నారు. వీరిని శనివారం న్యాయస్థానంలో హాజరుపరచగా అడిషనల్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ న్యాయాధికారి తేజ చక్రవర్తి.. రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని తెలిపారు.

ఫ్యాన్ల వితరణ

సంతకవిటి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొద్దూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వవిద్యార్థి కొరికాన చిన్నంనాయుడు పాఠశాలకు శనివారం రెండు ఫ్యాన్లను వితరణ చేశారు. వాటిని హెచ్‌ఎం మల్లేశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.దామోదరరావు, కృష్ణ, ప్రసాద్ ఉన్నారు.

అక్రమ నిర్మాణం నిలిపివేతకు చర్యలు

శృంగవరపుకోట, జూన్28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైతు బజారు సమీపంలో అనుమతులు లేకుండా చేపడుతున్న భవన అక్రమ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు పంచా యతీ ఈవో వి.వి.అనురాధ చర్యలు చేపట్టారు. పట్టణంలో అక్రమంగా చేపడుతున్న భవన నిర్మాణంపై స్థానికులు పలుమార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ వారు స్పందించలేదు. ఎట్టకేలకు విషయం తెలుసుకున్న ఈవో అనురాధ భవన నిర్మాణాన్ని ఆపించేందుకు పంచాయతీ మేస్త్రీను అక్కడకు పంపించే ఏర్పాటు చేస్తానన్నారు.

ఎన్టీఆర్‌తో తెలుగువారికి గౌరవం

●ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో ఎంపీ కలిశెట్టి

విజయనగరం, జూన్28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాల్లో తెలుగువారికి గౌరవాన్ని తీసుకు వచ్చిన మహనీయుడు నందమూరి తారకరామారావు అని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఎన్టీఆర్ 102 జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం సింగపూర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలకు సింగపూర్ రావడం ఆనందంగా ఉందన్నారు. గొప్ప కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఆహ్వానించినందుకు ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వి.మాధవనాయుడు, కురుగుండ్ల రామకృష్ణ, హనుమంతరావుతో పాటు ఎన్‌ఆర్‌ఐలు పాల్గొన్నారు.

పదిరోజుల్లో పనులు ప్రారంభించండి

విజయనగరం కలెక్టరేట్, జూన్28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో తాగునీటి పథకానికి రూ.12 కోట్లు మంజూరైన నేపథ్యంలో పది రోజుల్లో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అంబేద్కర్ ఆదేశించారు. రోజుకు 1 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేసేందుకు మొయిద వద్ద చంపావతిపై ఈ పథకాన్ని నిర్మించనున్నట్టు తెలిపారు. శనివారం సాయంత్రం తన చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏడాది లోపల పనులు పూర్తి అయ్యేటట్టు చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం కళాశాలలో అందుబాటులో ఉన్న 6 బోర్లు బావుల్లో నీరు రీచార్జ్ అవ్వడానికి వీలుగా నీటి సేకరణ కట్టడాలను, సంప్‌ను వారం రోజుల్లో నిర్మించాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ వైద్య కళాశాల డాక్టర్ పద్మలీల ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న బంగార్రాజు

భోగాపురం, జూన్28 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల మండలం జోగిరాజుపేటకు చెందిన గొంప సత్యవతి అనారోగ్యానికి గురైన నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆమెకు రూ.1.18 లక్షలు విడుదలయ్యాయి. శనివారం మండలంలోని పోలిపల్లిలో నివాసంలో మార్క్‌ఫెడ్ చైర్మన్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు సంబంధిత చెక్కును బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పిడుగు వెంకటసత్యం, నీలాపు అప్పలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుదేవకు 'విర్కో' సాయం



కృత్రిమ అవయవం అందజేస్తున్న విర్కో జనరల్ మేనేజర్ ప్రవీణ

కొత్తవలస, జూన్28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగళపాలెంలో గల గురుదేవ చారిటబుల్ ట్రస్టు చేపడుతున్న సేవా కార్యక్రమాలకు విర్కో ఫౌండేషన్ పూర్తి సహాయ సహకారాలను అందిస్తుందని ఆ ఫౌండేషన్ జనరల్ మేనేజర్ ప్రవీణ అన్నారు. శనివారం ఆమె గురుదేవ చారిటబుల్ ట్రస్టును సందర్శించారు. ఈ సందర్భంగా విర్కో ఫౌండేషన్ ఆర్థిక సాయంతో దివ్యాంగులకు సమకూర్చిన కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ జగదీశ్‌బాబు మాట్లాడుతూ ఇక్కడి ట్రస్టు అభివృద్ధిలో విర్కో ఫౌండేషన్ పాత్ర చాలా ఉందన్నారు. ఇటువంటి సంస్థల సహకారంతోనే వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో 200 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలతో పాటు చంక కర్రలు, వీల్‌చైర్స్, చెవిటి మెషిన్‌లు, అంధులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గురుదేవ ఆసుపత్రి వైస్ చైర్మన్ ఫణీంద్ర, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ పూర్తి

విజయనగరం, రింగురోడ్డు జూన్28 (ఆంధ్రజ్యోతి): సచివాలయం కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయ్యిందని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, నెలిమర్ల, సాలూరు పురపాలక సంఘాల్లో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శులకు రెండోరోజు బదిలీల ప్రక్రియ నిర్వహించారు. దీంతో పాటు ఎమినిటీస్, ప్లానింగ్ కార్యదర్శులకు ఐచ్ఛిక తప్పనిసరి బదిలీల ప్రక్రియ చేపట్టారు. కార్యక్రమంలో నెలిమర్ల కమిషనర్ తారకనాథ్, బొబ్బిలి కమిషనర్ రామలక్ష్మి, పార్వతీపురం కమిషనర్ సిహెచ్.వేంకటేశ్వర్లు, సాలూరు మేనేజర్ శివప్రసాద్, విజయనగరం కార్పొరేషన్ సహాయ కమిషనర్ అప్పలరాజు పాల్గొన్నారు.

విద్యుత్ దీపాలకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విజయనగరం రింగురోడ్డు, జూన్28 (ఆంధ్రజ్యోతి): నగరంలో విద్యుత్ దీపాల మరమ్మతులకు నగరపాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. ఈనెల 28న 'ఆంధ్రజ్యోతి'లో 'చీకట్లో నగరం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పందించారు. విద్యుత్ దీపాల మరమ్మతులకు ఆదేశించారు. దాంతో జమ్ము ప్రాంతంలో మరమ్మతుకు గురైన 53 విద్యుత్ దీపాలకు గానూ 29 దీపాలను సరిచేశారు. అలాగే 41, 35, 44 డివిజన్లలో వీధి దీపాలను బాగుచేశారు. బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వెనుక, ఎల్లమ్మ కోవెల ప్రాంతంలో హైమాస్ట్ దీపాలు ఏర్పాటు చేశారు.

ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి కృషి

●మంత్రి కొండపల్లి శ్రీనివాస్



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

గజపతినగరం, జూన్28 (ఆంధ్రజ్యోతి): రోగులకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలన్న లక్ష్యంతో గజపతినగరం సీహెచ్‌సీని ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం రూ.50 లక్షలు కేటాయించామని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక ఏరియా ఆసుపత్రికి రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ సమకూర్చిన రూ.15 లక్షలు విలువైన పరికరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు అవసరమైన పరికరాలను స్వచ్ఛంద సంస్థలు అందజేయడం అభినందనీయమన్నారు. ఆసుపత్రిలో మార్చురీ ఏర్పాటుకు అవసరమైన బ్లాక్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రెండు నెలల్లో ఏరియా ఆసుపత్రిని వినియోగంలోకి తీసుకు వచ్చేలా పనులు ముమ్మరం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పి.వి.వి.గోపాలరాజు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మక్కువ శ్రీధర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ జగదీశ్, రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ కె.భరత్‌బాబు, సెక్రటరీ శ్రీధర్, ఏరియా సెక్రటరీ మోహిత్, శీరంరెడ్డి రామ్‌కుమార్, ప్రదీప్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట, జూన్28 (ఆంధ్రజ్యోతి):స్థానిక సంస్థల ఎన్నికల్లో మరోమారు సత్తా చూపాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పిలుపునిచ్చారు. శనివారం ఆమె నివాసంలో నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలతో ఆమె సమావేశమయ్యారు. పార్టీకి సేవ చేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిరాంప్రసాద్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలలో తనతో పాటుగా కష్టపడిన ప్రతీ కార్యకర్త రుణం తీర్చుకుంటానన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ మాట్లాడుతూ టీడీపీలో కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకుడు కె.బాలాజీ, ఎన్నికల పరిశీలకులు రవికుమార్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

స్కిల్స్ అభివృద్ధి చేసుకోండి

రాజాం రూరల్, జూన్28 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ స్కిల్స్‌ను యువత అభివృద్ధి చేసుకోవాలని గురజాడలోని జేఎన్‌టీయూవీసీ ప్రొఫెసర్ డాక్టర్ డి.రాజ్యలక్ష్మి సూచించారు. శనివారం స్థానిక జీఎంఆర్‌ఐటీలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ దినోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంజనీరింగ్ యువతకు కాన్సెప్ట్యుయల్ లెర్నింగ్ అవసరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశానుసారం ఇంజనీరింగ్‌లో క్వాంటం కంప్యూటింగ్ టెక్నాలజీలో మైనర్ డిగ్రీ కోర్సులు ప్రవేశపెట్టనున్నట్టు ప్రకటించారు. దీనివల్ల రాబోయే రోజుల్లో నైపుణ్యం కలిగిన యువకులు మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ డా.గిరీశ్, సీఈవో అశ్వనీ సక్సేనా, వివిధ శాఖల విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు సహకరించండి



మాట్లాడుతున్న ఈఆర్‌వో ప్రమీల గాంధీ

గజపతినగరం, జూన్28 (ఆంధ్రజ్యోతి): కొత్త ఓటరు నమోదుకు రాజకీయ నాయకులు సహకరించాలని ఈఆర్‌వో ప్రమీల గాంధీ అన్నారు. శనివాం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ నాయకులు, ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారిని కొత్త ఓటరుగా నమోదు చేయాలన్నారు. అందుకు పార్టీ నాయకులు గ్రామసభలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాలుమార్పులు, చేర్పులు ఉన్నట్టయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. బీఎల్‌వోలు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ బి.రత్నకుమార్, ఎంపీడీవో బి.కల్యాణి, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

●చీపురుపల్లి, జూన్28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో చీపురుపల్లి ఇన్‌చార్జి ఆర్డీవో బి.ఆశయ్య శనివారం సమావేశం నిర్వహించారు. స్థానికమండల రెవెన్యూ కార్యాలయంలోనిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.1200కు మించి ఓటర్లు కలిగి ఉన్న ప్రాంతాల్లో కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, పోలింగ్ స్టేషన్ల చిరునామాల మార్పులు తదితరఅంశాలపై చర్చించారు.ససమావేశంలో టీడీపీ నాయకులు రౌతు కామునాయుడు, గవిడి నాగరాజు, జనసేననాయకులు విసినిగిరి శ్రీనివాసరావు, కోట్ల కృష్ణ, బీజేపీ నాయకులు ఇప్పిలి నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించండి



కస్టమ్స్ అధికారులతో పీటీసీ ప్రిన్సిపాల్ రామచంద్రరాజు

విజయనగరం క్రైం, జూన్28 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అధికారులు, సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అడిషనల్ డైరెక్టర్ జనరల్ నాసిన్ రవికిరణ్ అన్నారు. శనివారం పోలీసు శిక్షణ కళాశాలలో కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్స్ రెండు వారాల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం నూతన న్యాయ చట్టాలపై శిక్షణ సమయంలో అందించిన అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. మంచి అధికారిగా గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరాజు, వైస్ ప్రిన్సిపాల్ పీవీ అప్పారావు, డీఎస్పీలు శ్రీకాంత్, రమేశ్, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐల పాల్గొన్నారు.

పారిశుధ్యంపై రాజీ పడొద్దు

లక్కవరపుకోట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై రాజీపడొద్దని జిల్లా పంచాయతీ అధికారి డి.వి.మల్లికార్జునరావు అధికారులను ఆదేశించారు. శనివారం ఎల్.కోట మండలం పోతంపేలో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. రెండు గంటల పాటు తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థల తీరు ఆరా తీశారు. ఆయన వెంట ఈవోపీఆర్‌డీ కుమార్, కార్యదర్శి యశోద ఉన్నారు.

బిల్లులేవీ?

●జేఎన్‌టీయూ హాస్టల్ భవనాలు పూర్తయి రెండేళ్లు

●అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న కాంట్రాక్టర్లు



పనుల నాణ్యతను పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు (ఫైల్)

విజయనగరం రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్‌టీయూలో రెండేళ్ల కిందట నిర్మించిన హస్టల్ భవనాలకు సంబంధించిన బిల్లులు కాలేదు. దాంతో కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. 2023లో అప్పటి ప్రభుత్వం జేఎన్‌టీయూలో బాయ్స్ హాస్టల్, గర్ల్స్ హాస్టల్ భవన నిర్మాణాలకు ఆన్‌లైన్‌లో టెండర్లు పిలిచింది. నిర్ధేశించిన సమయానికి సదరు కాంట్రాక్టర్లు భవన నిర్మాణం పూర్తి చేసి జేఎన్‌టీయూకు అప్పగించారు. కాంట్రాక్టర్లకు రెండు దశల్లో మాత్రమే బిల్లు విడుదల చేశారు. ఈక్రమంలో భవన నిర్మాణాల నాణ్యతను 2024 ద్వితీయార్థంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు పర్యవేక్షించి ఓకే చెప్పినప్పటికీ కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన చివరి బిల్లు రూ.4.50 లక్షలు చెల్లించలేదు. దాంతో బిల్లు కోసం జేఎన్‌టీయూ వీసీతో పాటు రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్, ఇంజనీరింగ్ విభాగం అధికారుల చుట్టూ కాంట్రాక్టర్ల ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇప్పటికైనా బిల్లుల విడుదలకు ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సి ఉంది.

రైలు ఢీకొని మహిళ మృతి

బాడంగి, జూన్28 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీ కొనడంతో గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్టు బొబ్బిలి జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ బి.ఈశ్వరరావు తెలిపారు. ఆయన శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. డొంకినవలస, బొబ్బిలి రైల్వే స్టేషన్ సమీపంలో గొల్లాది సమీపంలో సుమారు 45 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని మహిళ శనివారం మృతి చెందిందని చెప్పారు. మృతురాలు ఎరుపు, పసుపురంగు చీర ధరించి ఉందన్నారు. ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు 8309901038, 9491813163, 9490617089 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

గంజాయితో ఐదుగురి అరెస్టు

బొండపల్లి, జూన్28 (ఆంధ్రజ్యోతి): మండలంలో గొట్లాం బైపాస్ రోడ్డు జంక్షన్ వద్ద గంజాయిని తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను శనివారం అరెస్టు చేసినట్టు సీఐ జీఏవీ రమణ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. బొండపల్లి ఎస్‌ఐ యు.మహేష్ సిబ్బందితో దాడిచేసి 1.2 కేజీల గంజాయిని పట్టుకుని నిందితులను అరెస్టు చేశారన్నారు. వీరిలో పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంకు చెందిన డోలక కీర్తి రాజ్‌కుమార్, పోరపు అమర్, మీసాల అకిల్, ఒడిశా రాష్ట్రం రాయగడ మండలం ఇరుకుబడి గ్రామానికి చెందిన తండంగి రమేశ్, ఇవిన్ శ్యామ్ ఉన్నారన్నారు. వారి నుంచి 6 సెల్‌ఫోన్లు, ఒక మోటారు సైకిల్, రూ.వెయ్యి నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

రాజాంలో ఒకరు..

●రాజాం రూరల్, జూన్28 (ఆంధ్రజ్యోతి): గంజాయిని తరలిస్తూ ఒకరు, గంజాయి సేవిస్తూ మరో ఐదుగురిని రాజాం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు. గంజాయి సేవిస్తున్న ఐదుగురిపై కన్జూమర్ కేసు నమోదు చేశారు. రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. రాజాం-చీపురుపల్లి రోడ్డులో శనివారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా మెరకముడిదాం మండలం జి.మర్రివలస గ్రామానికి చెందిన వలిరెడ్డి సత్యనారాయణ నుంచి 1400 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించారని సీఐ తెలిపారు. అలాగే పట్టణంలోని మల్లికార్జున కాలనీ సమీపంలో గంజాయి సేవిస్తున్న ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సీఐ పేర్కొన్నారు.

ట్యాంకర్ ఢీ: యువకుడికి గాయాలు

బొబ్బిలి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పైల గణేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శివడవలస గ్రామానికి చెందిన గణేశ్ స్థానిక ఇందిరమ్మకాలనీ నుంచి పట్టణానికి బైకుపై వస్తుండగా వెనుక నుంచి వస్తున్న ట్యాంకరు ఢీకొంది. దీంతో ఆయన కాలు పూర్తిగా నుజ్జు అయింది. సమాచారం తెలియగానే ట్రాఫిక్ ఎస్‌ఐ జ్ఞానప్రసాద్ తన సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. క్షతగాత్రుడిని ఎత్తుకెళ్లి ఆటోలో ఆసుపత్రికి తరలించారు. స్థానిక సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అనంతరం విజయనగరం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ట్యాంకర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

మహిళపై దాడి చేసిన వ్యక్తి అరెస్టు

వేపాడ, జూన్28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లబిల్లిలో ఓ మహిళ మెడలో బంగారు గొలుసు తెంచుకెళ్లేందుకు యత్నించడమే కాకుండా ఆమెపై కత్తిపీటతో దాడిచేసిన వ్యక్తిని అరెస్ట్ చేశామని వల్లంపూడి ఇన్‌చార్జి ఎస్‌ఐ నవీన్ పడాల్ తెలిపారు. అతడిని కొత్తవలస కోర్టుకు తరలించామన్నారు.

ఎస్‌ఐ తీరుపై జర్నలిస్టు సంఘాల నిరసన



ఏఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టుల సంఘాల నేతలు

విజయనగరం క్రైం, జూన్28 (ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్టు, మీడియా ప్రతినిధుల సంఘం నాయకుడు ఎంఎంఎల్ నాయుడుపై నగరంలోని టూటౌన్ పోలీసుస్టేషన్ ఎస్‌ఐ మురళీ దురుసుగా ప్రవర్తించడాన్ని జిల్లాలోని జర్నలిస్టు సంఘాల నేతలు ఖండించారు. రెండో రోజు శనివారం నిరసన తెలియజేస్తూ మండలాల్లో అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. ఎస్‌ఐ చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల నగరంలో వృద్ధ దంపతులపై దాడి జరిగిన నేపథ్యంలో ఆ వార్తను ప్రసారం చేసేందుకు జర్నలిస్టు వీడియో తీస్తుండగా ఎస్‌ఐ మురళీ దురుసుగా ప్రవర్తించారన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఎస్పీ సౌమ్యలతను జర్నలిస్టు సంఘాల నేతలు కలిసి వినతిపత్రం అందించారు.

సమ్మె నోటీస్ అందజేత

గజపతినగరం, జూన్28 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యలపై జూన్ 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నామని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.సుభాషిణి, వై.నారాయణమ్మ తెలిపారు. శనివారం స్థానిక ఐసీడీఎస్ పీవో ఎం.రాజేశ్వరికి సమ్మె నోటీస్‌ను అందజేశారు. కార్యక్రమంలో త్రివేణి, సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెవిలో పువ్వులతో నిరసన

రాజాం రూరల్, జూన్28 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజనీరింగ్ అవుట్ సోర్సింగ్ సిబ్బంది శనివారం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని అన్నా క్యాంటీన్ ఎదుట చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. ఇంజనీరింగ్ అవుట్ సోర్సింగ్ సిబ్బంది 53 రోజులుగా ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

డప్పు కళాకారులకు పింఛన్లు ఇవ్వండి

వేపాడ, జూన్28 (ఆంధ్రజ్యోతి): చర్మ, డప్పు కళాకారులకు పింఛన్లు మంజూరు చేయాలని వాగ్గేయకారుడు ఆతవ ఉదయభాస్కర్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఆతవలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 40ఏళ్లు దాటిన చర్మకారులకు, 50 ఏళ్లు దాటిన డప్పు కళాకారులకు పింఛన్లు మంజూరు చేయాలని 2018 లో ప్రభుత్వం జీవో 199, 191లను జారీ చేసిందన్నారు. వాటి ద్వారా చాలామంది లబ్ధి పొందుతున్నారన్నారు. మరింత మంది లబ్ధి పొందేందుకు అవకాశం కల్పించాలన్నారు. అలాగే గుర్తింపు కార్డులు జారీ చేయాలని ఆయన కోరారు.

పేదల అభ్యున్నతికి సీపీఐ కృషి

రాజాం, జూన్28 (ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతే సీపీఐ అంతిమ లక్ష్యమని ఆ పార్టీ నేతలు అన్నారు. శనివారం స్థానిక కళాసాగరంలో పార్టీ నియోజకవర్గ మహాసభ నిర్వహించారు.ముందుగా సీపీఐ పతాకాన్ని సీనియర్ నాయకుడు కనకరాజు ఆవిష్కరించారు. అనంతరం నియోజకవర్గ కార్యదర్శి ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్ అధ్యక్షతన ప్రతినిధుల సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణమూర్తి హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనంద్, ఎస్.నాగభూషణరావు, కృష్ణ, గంగారాం, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

మెకరముడిదాం, జూన్28 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అధికారులు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ తలచుట్ల హరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. శాఖల వారీగా ఆయన సమీక్షించారు. సమావేశంలో ఎంపీడీవో జి.రామకృష్ణ, తహసీల్దార్ సులోచనారాణి, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో జిల్లాకు ఆరు పతకాలు

విజయనగరం దాసన్నపేట, జూన్28 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఉమ్మడి విజయనగరం జిలాకు చెందిన ఆరుగురు క్రీడాకారులు పాల్గొని ఆరు బంగారు పతకాలు సాధించారు. షన్ముఖ, సిద్ధార్థలు బంగారు పతకాలు సాధించగా, హర్షవర్ధన్ కాంస్య పతకం, వైష్ణవి దేవికి కాంస్యపతకం, రోహిణి, హర్షిణి, తరుణ కాంస్య పతకాలు సాధించారు. ఈ పోటీలు ఈ నెల 23 నుంచి 25 వరకూ ఉత్తరాఖండ్ హరిద్వార్‌లో జరిగాయి. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు, రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావు, కోచ్‌లు యశస్విని, కోటేశ్వరరావు అభినందించారు.

సెర్ప్‌లో సెపరేట్ బదిలీలు

(ఐదో పేజీ తరువాయి)

నిబంధనల ప్రకారం జరగలేదని సమాచారం. జీవో నెంబరు 23 ప్రకారం ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారిని తప్పనిసరిగా బదిలీ చేయాల్సి ఉంది. అలాగే సొంత జిల్లా వారిని కూడా బదిలీ చేయాలని నిబంధనలు చెబుతున్నాయి. డీపీఎంలకు వచ్చేసరికి ఐదేళ్లు దాటిన 8 మందిని బదిలీ చేయాల్సి ఉండగా ఇద్దరిని జిల్లాలోనే ఉంచారు. వారిద్దరికి ఐదేళ్లు దాటడమే కాకుండా సొంత జిల్లాకు చెందిన వారు కావడం గమనార్హం. ఓ మహిళా డీపీఎంను వెయ్యి కిలోమీటర్ల దూరంలో ఉన్న నంద్యాలకు బదిలీ చేయడం జిల్లాలో చర్చనీయాంశమైంది. ఆమె కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. ఏపీఎంలకు సంబంధించి జిల్లాలో 22 మంది గత నెలలో బదిలీ కౌన్సెలింగ్ కోసం విజయవాడలోని సెర్ప్ కార్యాలయానికి పంపించారు. వారిలో ఆరుగురు కౌన్సెలింగ్‌కు హాజరు కాకుండా తిరిగి జిల్లాకు వచ్చారు. వీరికి ఎక్కడ పోస్టులు చూపిస్తారు?అనేది తెలియాల్సి ఉంది. కౌన్సెలింగ్ హాజరైన 11 మందిలో 8 మందిని కోనసీమ, రాజమండి, కాకినాడ వంటి ప్రాంతాలకు బదిలీలు చేశారు. సాధారణంగా జోన్ పరిధిలో వీరిని బదిలీ చేయాల్సి ఉండగా జోన్ దాటించడంపై గగ్గోలు పెడుతున్నారు. మండల స్థాయిలో కీలక పోస్టుల్లో ఉన్న ఎంపీడీవో, తహసీల్దార్లను జిల్లాలోనే బదిలీ చేస్తుండగా ఏపీఎంలను జిల్లా దాటించడంపై పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజులు క్రితం 11 మంది ఏపీఎంలు విజయవాడలోని సెర్ప్ సీఈవోని కలిసి తమ సమస్యను విన్నవించుకున్నారు. మహిళా ఉద్యోగులకు బదిలీల్లో తీవ్ర నష్టం జరిగిందన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఇదే విషయాన్ని డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి వద్ద ప్రస్తావించగా నిబంధనల ప్రకారం జిల్లాలో ఐదు సంవత్సరాల సర్వీసు పూర్తయిన వారి పేర్లు పంపించామని, ఆయా మేరకు వారికి బదిలీలు ఉత్తర్వులు వచ్చాయని చెప్పారు.

నియామక తేదీయే కీలకమట

(ఐదో పేజీ తరువాయి)

మరుసటి రోజు ఉద్యోగంలో చేరారు. దీనివల్ల కొంత మందికి కౌన్సెలింగ్ జరిగిన నవంబర్ 5, మరికొంత మందికి నవంబర్ 6న చేరినట్లు సర్వీస్ రికార్డుల్లో నమోదైంది. సాయంత్రం ఐదు గంటల నుంచి అర్ధరాత్రి వరకు కౌన్సెలింగ్‌లో పాల్గొన్నవారిలో చాలా మంది నవంబర్ 5న గ్రామ, వార్డు సచివాలయాల్లో చేరినట్లు సర్వీస్ రికార్డుల్లో నమోదు చేసేసుకున్నారు. వీరంతా బదిలీల్లో ముందు వరసకు వెళ్లారు. సర్వీస్ రికార్డులో నవంబర్ 6న నమోదైన వారంతా వెనక ఉండిపోయారు. ఇది మోసం అంటూ వాపోతున్నారు. నియామక సమయంలో అందరం ఒకే రోజున గంటల వ్యవధి తేడాతో నియామక పత్రాలు పొందామని, గ్రామ, వార్డు సచివాలయాల్లో అధికారులు చేర్చుకొనే సమయంలో మార్పుతో ఒక రోజు తేడా వస్తున్నందున అధికారులు చేసిన తప్పునకు తమను బలి చేయొద్దని కోరుతున్నారు. అనువైన స్థానాలకు అర్హత వున్న తమను కాదని సర్వీస్ రికార్డులో నమోదైన డేట్‌ను ప్రాధాన్యత అంశంగా తీసుకోవడం మెరుగైన ర్యాంకులు సాధించిన వారిని అవమానించడమేనంటూ పేర్కొంటున్నారు. ఈ విషయంలో యూనియన్ నాయకులు పెదవి విప్పకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

● ఎక్కువ వయసులో దూర ప్రాంతాల్లో ఉద్యోగం చేయడం ఏ ఉద్యోగికైనా కష్టమే. అందుకే బదిలీల సమయంలో డేట్‌ఆఫ్‌బర్త్ (వయస్సు)కు ప్రాధాన్యం ఇస్తారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రాథమికంగా తయారు చేసిన జాబితాలోనూ ఎక్కువ వయసు వున్నవారికి అన్యాయం జరుగుతోంది. డేట్ ఆఫ్ అపాయింట్‌మెంట్‌ను పరిగణనలోకి తీసుకోవడంతో ఆ తేదీన చేరిన చిన్న వయసు కలిగిన ఏఎన్ఎంలు, ఎక్కువ వయసు కలిగిన ఏఎన్ఎంల కంటే ముందుకు వచ్చారు.

● నియామక కౌన్సెలింగ్ తేదీ అందరికీ ఒకటే కాబట్టి డేట్ ఆఫ్ అపాయింట్‌మెంటును ప్రాధాన్యత క్రమం నుంచి తొలగించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాకాధికారి జీవనరాణిని ఏఎన్ఎంలు కోరారు. దీనికి డీఎంహెచ్‌ఓ సానుకూలంగా స్పందించడంతో డేట్ ఆఫ్ అపాయింట్‌మెంటును బదిలీ ప్రాధాన్యత నుంచి తొలగించాలని సూచిస్తారని అంతా అనుకున్నారు. కానీ తుది జాబితా కూడా అలాగే విడుదల చేశారు. దీంతో నిరాశ చెందారు.

'కొత్త' మార్పులు

(ఐదో పేజీ తరువాయి)

శిబిరం ఏర్పాటు కోసం అన్ని పనులు చకచకా సాగుతున్నాయి. ఇక్కడ గిరిజనయూనిర్సిటీ కోసం 2015లో తెలుగుదేశం ప్రభుత్వం భూములు సేకరించగా యూనిర్సిటీని వైసీపీ ప్రభుత్వం వేరే చోటుకు తరలించింది. కూటమి ప్రభుత్వం రాగానే ఇది వరకూ సేకరించిన భూముల్లో రాష్ట్రపోలీసు గ్రేహౌండ్స్ దళాల శిక్షణ కేంద్రం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

● కొత్తసుంకరపాలెం గ్రామ సమీపంలో సుమారు రూ.1000 కోట్ల పెట్టుబడితో అల్ట్రా టెక్ సిమెంట్ కర్మాగార పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రాష్ట్రప్రభుత్వం నియోజకవర్గానికొక ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేస్తుండగా శృంగవరపుకోట నియోజకవర్గానికి సంబంధించి బలిఘట్టాం గ్రామ రెవెన్యూలో సుమారు 56 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు కోసం శంఖుస్థాపన కూడా జరిగింది.

● విశాఖపట్నానికి దగ్గరలో ఉండడంతో ఒక పక్క రియల్‌ఎస్టేట్‌రంగం పరుగులు తీస్తోంది. మండలంలో అపార్టుమెంట్ సంస్కృతి పెరిగిపోయింది. ఇప్పటికే కంటకాపల్లిలో నున్న శారదా కర్మాగారం విజయవంతంగా నడుస్తోంది. చినరావుపల్లి గ్రామంలో ఏర్పాటు అయ్యే పతంజలి సంస్థ తమ ఉత్పత్తులకు సంబంధించిన కంపెనీలు, వ్యవసాయాభివృద్ధి జరిగితే మండలంలోని చినరావుపల్లి, కంటకాపల్లి కాటకాపల్లి, గొల్లపేట, కొత్తూరు గ్రామాలకు చెందిన వారికి ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభించవచ్చునంటున్నారు.

ఖైదీలకు సంక్షేమ ఫలాలు అందాలి



మాట్లాడుతున్న జిల్లా అదనపు న్యాయాధికారి వివేక్ ఆనంద్ శ్రీనివాస్

పాలకొండ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రిమాండ్ ఖైదీలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందించా లని జిల్లా అదనపు న్యాయాధికారి వివేక్ ఆనంద్ శ్రీనివాస్, జిల్లా న్యాయసేవా ధికార సంస్థ అధ్యక్షుడు ఎం.శ్రీధర్, మండల న్యాయసేవా సంఘం అధ్యక్షురాలు హరిప్రి య అన్నారు. స్థానిక సబ్‌జైలును వారు శనివారం సందర్శించారు. ఖైదీల తో మాట్లాడుతూ జైల్లో అన్ని సదుపాయాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం చట్టాల పట్ల అవగాహన కల్పించారు. జైలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, పేపర్, పుస్తకాలు ఖైదీలతో చదివిం చాలని జైలు సూపరింటెండెంట్ బి.జోగులుకు సూచించారు. ఈ కార్యక్ర మంలో న్యాయవాదులు ఎం.శామ్యూల్, బి.రామ్మోహన్‌రావు, సత్యనారా యణ, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

వారాహిదేవికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొండ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నక్కలపేట షిర్డీసాయి సకల దేవతల ఆలయంలో వారాహిదేవి నవరాత్రి ఉత్సవాలను మూడో శనివారం ఘనంగా నిర్వహించారు. అలయ ప్రధాన అర్చకుడు పర్రి శరత్‌కుమార్ ఆధ్వర్యంలో వారాహి దీక్షాదారులు ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, కుంకుమ పూజలతో పాటు నిత్య పూజలు నిర్వహించారు. మంగళ హారతులు చేపట్టి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పారిశుధ్య నిర్వహణ ఇలాగేనా?

● పల్లెల్లో ఎక్కడికక్కడే దర్శనమిస్తున్న చెత్తా చెదారం
● పర్యవేక్షణ కరువు ● ఇబ్బంది పడుతున్న ప్రజలు

సంతకవిటి, జూన్28 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో పారిశుధ్య నిర్వహణను పట్టించుకునే నాథులే కరువయ్యారు. చెత్తాచెదారాలు ఎక్కడికక్కడే దర్శనమిస్తున్నాయి. చెత్త నుంచి సంపద సృష్టించాలనే ప్రభుత్వ ఆదేశాలను పంచాయతీ అధికారులు బేఖాతరు చేస్తున్నారు. మండలంలో 34 పంచాయతీలు ఉన్నాయి. అందులో 15 చోట్లే చెత్త సంపద కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మరో రెండు చోట్ల నిర్మాణ దశలో ఉన్నాయి. మిగిలిన 17 చోట్ల ఎప్పుడు ఏర్పాటు చేస్తారో తెలియని పరిస్థితి ఉంది. అయితే చెత్త సంపద కేంద్రాలు పూర్త యిన పంచాయతీల్లోనూ పారిశుధ్య నిర్వహణపై పర్యవేక్షణ కరువైంది. దాంతో గ్రామ శివారున రోడ్లపై చెత్తను పారబోస్తున్నారు. దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని సిరిపురం నుంచి సేకరించిన చెత్తను పొందూరు- సంతకవిటి ప్రధాన రహదారి పక్కన పడేస్తున్నారు. వర్షాలకు చెత్తా చెదారాలు కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది. అటుగా రాకపోకలు సాగించేవారి అవస్థలు వర్ణనాతీతం. ఇదే పరిస్థితి మండలంలోని మండవకురిటి, మందరాడల్లో ఉంది. చెత్త సేకరణ వ్యవస్థను మెరుగు పరచడంలో అధికారులు నిర్లక్ష్య ధోరణి కనబరుస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను అధికారులు సీరియస్‌గా తీసుకోవడంలేదు. దీంతో ప్రజారోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉంది.



సిరిపురంలో ప్రధాన రహదారి పక్కనే ఇలా..

పేదలకు అండగా ప్రభుత్వం

● మంత్రి సంధ్యారాణి, పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర
● సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

సాలూరు/ మెంటాడ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సీఎం సహాయ నిధి ద్వారా పేదలకు అండగా నిలుస్తోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శనివారం సాలూ రులోని తన స్వగృహంలో ఆమె సుమారు రూ.3లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదా రులకు అందజేశారు. సాలూరులోని ప్రతిపాటి రాజారా వుకు రూ.45,751, మెంటాడ మండలం పిట్టాడ గ్రామాని కి చెందిన గుళ్లిపల్లి రియానీ శ్రీనిధికి రూ.లక్షా 85వేల 701, పిట్టాడ గ్రామానికి చెందిన ఎర్ర మురళీకృష్ణకు రూ.85వేల చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రజలకు సకాలంలో ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో





సాలూరు: చెక్కులు అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి, పార్వతీపురంరూరల్: లబ్ధిదారులతో ఎమ్మెల్యే విజయచంద్ర

ఏఎంఎస్ చైర్మన్ ముఖీ సూర్యనారాయణ, పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, గూడెపు యుగంధర్ తదితరులు పాల్గొన్నారు. ● పార్వతీపురం రూరల్: కూటమి ప్రభుత్వం పేద లకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే బోనెల విజయచం ద్ర అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన పలువురికి సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

సాలూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ శ్రేణులు గ్రామస్థాయి నుంచే సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని మంత్రి సంధ్యారాణి అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో సాలూరు నియోజకవర్గంలోని క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సాలూరు నియోజకవర్గ పరిశీలకుడు కిమిడి నాగార్జున, అరకు పార్లమెంటరీ నియోజకవర్గ కోఆర్డినేటర్ సత్తిబాబులు పార్టీ బలోపేతం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ ప్రజల సమస్యలపై సానుభూతితో స్పందిస్తూ వారి మనసులో విశ్వాసం కలిగించేలా పార్టీ కార్యకర్తలు పనిచేయాలన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

వీరఘట్టం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ నరసింగరావుకు పంచాయతీ కార్మికులు శనివారం సమ్మె నోటీసు అందించారు. ఈసందర్భంగా సీఐటీయూ వీరఘట్టం కార్యదర్శి నులకజోడు ప్రసాదరావు మాట్లాడుతూ జూలై 9న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వీరఘట్టం మేజర్ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ధ్యేయం



మాట్లాడుతున్న టీడీపీ పరిశీలకుడు తెంటు

గరుగుబిల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కార్యక ర్తల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని పార్టీ పరిశీల కుడు, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు అన్నారు. శనివారం గరుగుబిల్లిలో మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావే శానికి మండల కన్వీనర్ అక్కేన మధుసూదనరావు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా లక్ష్మునా యుడు మాట్లాడుతూ పార్టీ విధానం మేరకు పార్టీ సంస్థాగత ఎన్నికలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామస్థాయిలో గ్రామ కమిటీలు, బూత్ ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జిల ఏకాభిప్రాయంతో పూర్తి చేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్ష స్థానానికి నలుగురు పేర్లను అధిష్ఠానం దృష్టికి పంపించనున్నట్టు తెలిపారు. కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ప్రధాన ధ్యేయన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ జి.రామినాయుడు, మండల పరిశీలకుడు గుంట్రెడ్డి రవికుమార్, పార్టీ ప్రతినిధులు ఎం.పురుషోత్తం నాయుడు, అంబటి రాంబాబు, కె.సుమన్, డి.సత్యనారాయణ, ఎం.తవిటినాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గౌరీపురం బస్సు పునరుద్ధరణ

గరుగుబిల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం నుంచి బలిజిపేట మండలం గౌరీపురం గ్రామానికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించారు. గత కొన్నాళ్లుగా పార్వతీపురం నుంచి గౌరీపురం గ్రామానికి రాత్రి పూట సర్వీసులు నిలుపుదల చేశారు. ఈ ప్రాంతం నుంచి అధికంగా కాయగూరలను పలు ప్రాంతాలకు తర లించేవారు. అయితే బస్సు సౌకర్యం లేక ఆటోలపై ఆధారపడిన పరిస్థితి ఏర్పడింది. అలాగే గరుగుబిల్లి, రావుపల్లి, కొత్తపల్లితో పాటు పలు గ్రామాలకు వెళ్లేవారు రాత్రి సమయాల్లో పలు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. బస్సు సౌకర్యంపై కొత్తపల్లికి చెందిన టీడీపీ ప్రతినిధి గొట్టాపు లక్ష్మంనాయుడు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించి బస్సు సౌకర్యాన్ని కల్పించారు.

అనుమతి లేకపోయినా..

(ఐదో పేజీ తరువాయి)

అద్దెకు ఇవ్వడమో.. అనధికారికంగా నిర్వహించ డమో చేస్తున్నారు. అదే మాదిరిగా గోదాములు సైతం అనధికారికంగా ఏర్పాటు చేసుకున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

21 ఏళ్లు నిండని వారికి మద్యం అమ్మకూ డదన్న నిబంధన కూడా పక్కకు వెళ్లిపోయినట్టు తెలుస్తోంది. ఎక్కడికక్కడే దాబాలు, వైన్‌షాపుల వద్ద అనధికారిక పర్మిట్ రూమ్‌ల వద్ద చిన్నవ యసు వారు ఎక్కువగా కనిపిస్తున్నారు. పోలీసు లు, సంబంధిత అధికారులు అటువైపుగా చూడడం లేదు. వాస్తవానికి మద్యం షాపులకు సంబంధించి డ్రా తీయకుండా ముందే చాలా మంది సిండికేట్‌గా మారారు. షాపులు ఎవరికి దక్కినా.. అందరికీ వాటాలు అన్నవిధంగా ఒప్పం దాలు చేసుకున్నారు. ఈ క్రమంలో లాటరీ తీసిన తరువాత కూడా ఒప్పందాలు జరిగాయి. ఒక్కో మండలంలో కనిష్ఠంగా ఐదు వరకూ షాపులను ఏర్పాటుచేశారు. పట్టణ ప్రాంతాల్లో అయితే 7 నుంచి 10 వరకూ షాపులు ఏర్పాటయ్యాయి. కొన్ని షాపుల్లో రోజువారీ విక్రయాలు అధికంగా ఉన్నాయి. మరికొన్ని వాటిలో ఆశించిన స్థాయిలో జరగడం లేదంటున్నారు. ఇలా విక్రయాలు తక్కువగా ఉన్నచోట 'బెల్ట్'ను ప్రోత్సహించినట్టు ఆరోపణలున్నాయి. మందుబాబులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు, ఆహారం, చిరుతిళ్లు అందుబాటులో ఉంటున్నాయి. దీంతో అక్కడ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్టు జరిగిపోతోంది.

గురుకుల కళాశాలలో ప్రవేశాలకు
దరఖాస్తుల ఆహ్వానం

బాడంగి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక సాంఘిక వెల్ఫేర్ బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ జి.వరప్రసాద్ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీలో 30 ఖాళీలకు దరఖాస్తులు కోరుతున్నామన్నారు. 14 నుంచి 16 సంవత్సరాల వయస్సు కలిగి, లక్ష రూపాయల వార్షిక ఆదాయం కలిగి, పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని వివరించారు. బదిలీ సర్టిఫికెట్, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలో సంప్రదించాలన్నారు. వివరాలకు 8919598872 నెంబరుకు సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

హౌసింగ్ లబ్ధిదారులకు ప్రోత్సాహకం

రామభద్రపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో మంజూ రైన పక్కా ఇళ్లకు కూటమి ప్రభుత్వం అదనంగా నిధులు విడుదల చేసిందని హౌసింగ్ ఏఈ మత్స వెంకటేష్ తెలిపారు. మండల హౌసింగ్ కార్యాలయంలో శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.70వేల వంతున మంజూరు చేసిందని చెప్పారు. దీనికి సంబంధించి మండలంలో 141 మందికి లబ్ధి చేకూరిందని, ఇప్పటికే కొంతమంది వారి బ్యాంకు ఖాతాలకు నగదు జమచేశారని తెలిపారు. కావున లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని కోరారు. అలాగే కొత్త ఇళ్ల మంజూరుకు ఇప్పటివరకు మండలంలో 1,360 దరఖాస్తులు వచ్చాయని, మిగిలిన వారు ఈ నెలాఖరులోగా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆర్పీలకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ శరత్‌బాబు

బొబ్బిలి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మెప్మా పరిధిలోని పట్టణానికి చెందిన 51 మంది రీసోర్స్ పర్సన్లకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు శనివారం అందజేశారు. మెప్మా సీఎంఎం వేణుగోపాల్, ఐదో వార్డు కౌన్సిలరు వెలగాడ హైమావతి, టీడీపీ నాయకులు బొత్స అప్పలు, రాయపురెడ్డి భాను పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, పుస్తకాలు..

బొబ్బిలి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూలులో 330 మంది విద్యార్థులకు మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు శనివారం ప్లేట్లు, పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బేబీనాయన జన్మదిన వారోత్సవాలను పురస్కరించుకుని 29వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి తీగల వెంకటేశ్వరరావు వీటిని వితరణ చేశారు. అనంతరం ఎండీఎం అమలుతీరును చైర్మన్ పరిశీలించారు. నాణ్యతతో కూడిన ఆహారాన్ని పిల్లలకు అందజేయాలని సూచించారు. హెచ్ఎం జగదీశ్, టీడీపీ నాయకులు వెంకటేశ్వరరావు, ఎక్కుడు వాసు, చింతాడ రవి, పసుమర్తి గౌరు పాల్గొన్నారు.

రాజచెరువువలసలో గ్రామసభ

బొబ్బిలి రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దిబ్బగుడ్డివలస సచివాలయ పరిధి రాజచెరువువలస గిరిజన గ్రామంలో ఎంపీడీవో పి.రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం 'దర్తి ఆబా భాగీదారి అభియాన్' గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల ప్రయోజనం ఇంకా పొందని గిరిజన ప్రజలను వాటిని అందజేయడమే ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశం అన్నారు. వైద్యాధికారి భరద్వాజ్ బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. వైద్య శిబిరం నిర్వహించారు. డెప్యూటీ ఎంపీడీవో అల్లు భాస్కరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు వాసిరెడ్డి సత్యనారాయణ, ఎంపీటీసీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రైతులకు బిల్లులు ఇవ్వాలి

రామభద్రపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పురుగు మందుల షాపులో రైతులు కొనుగోలు చేస్తున్న ఎరువులు, పురుగు మందులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి వి.వెంకటయ్య అన్నారు. మండల కేంద్రంలోని పురుగు మందుల షాపులను ఆయన శనివారం తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు విక్రయించిన షాపుల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. స్టాకు వివరాలు అడిగి తెలు సుకున్నారు. మండలంలో వరి విత్తనాల కొరత లేదని తెలిపారు. యూరియా కూడా మండలంలోని 3 పీఏసీఎస్‌లలో పంపిణీకి సిద్ధంగా ఉందన్నారు.

వైసీపీ మహిళా విభాగం జాయింట్ సెక్రటరీగా అచ్యుతవల్లి



బొబ్బిలి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తూముల అచ్యుతవల్లి వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం జాయింట్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈసందర్భంగా ఆమె మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని అచ్యుతవల్లి, భాస్కరరావు దంపతులు అన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

గరుగుబిల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలో పారిశుధ్యం నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మండల పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాలరావు హెచ్చరించారు. చినగుడబ, వల్లరిగుడబ, పెదగుడబతో పాటు పలు పంచాయతీల్లో ఆయన శనివారం పర్యటించి, ప్రత్యేక అవగాహన కల్పించారు. గృహాల నుంచి సేకరించే వ్యర్థాలను విధిగా చెత్త సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు సంబంధిత గ్రామాల్లో ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ పరిశీలనలో కార్యదర్శి టి.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.